శబరిమలైలో రోడ్డు ప్రమాదం

ఇద్దరు నగరవాసులు మృతి

మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలు

శబరిమలై రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోతన్న (ఫైల్‌ఫోటో), సీతారామ్‌నాయక్(ఫైల్‌ఫోటో).

ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు.

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 18: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నుంచి శబరిమలై అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లి వ్యక్తులు రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైయ్యాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్ రెడ్డినగర్ ప్రాంతానికి చెందిన డాక్టర్ పోతన్న(50) , శ్రీరామనగర్ ప్రాంతానికి చెందిన సీతారామ్‌నాయక్(49)లు ఆర్ఎంపీ డాక్టర్లుగా క్లినిక్‌లు నిర్వహిస్తున్నాడు. ఆయన కుమారుడు చరణ్, స్నేహితుడు శివకుమార్ గౌడ్‌లు కలిసి శబరిమలై అయ్యప్ప స్వామి దర్శనానికి ఈ నెల 16వ తేదీన టిఎస్07హెచ్‌హెచ్6999 నెంబర్ గల కారులో బయలుదేరారు. అయ్యప్ప స్వామిని దర్శనం చేసుకోని అనంతరం బుధవారం ఉదయం నగరానికి బయలుదేరారు. తమిళనాడు దేవాదయపట్టి ప్రధాన రహదారి వద్దకు రాగానే పక్క నుంచి వెళ్తున్న మరో వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారు పల్టీలు కొట్టి పొదల్లో పడిపోయింది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు అక్కడి పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే అక్కడకు చేరుకొని పరిశీలించారు. అప్పటికే కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో పోతన్న, సీతారామ్‌నాయక్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు చేతన్, శివకుమార్‌గౌడ్‌లకు తీవ్ర గాయాలైనట్లు గుర్తించి స్థానికంగా ఉన్న మధురైలోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతున్న వారి పరిస్థితి సైతం తీవ్ర విషమంగా ఉందని డాక్టర్లు వెల్లడించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్, శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. స్థానికులు వారి కుటుంబాల్ని ఓదార్చేందుకు వెళ్లి కన్నీటి పర్యంతమయ్యారు.

సకాలంలో స్పందించారు

50 లక్షలు రికవరీ చేశారు

అధిక లాభాల పేరుతో

1.31కోట్ల టోకరా

ఫిర్యాదు అందుకొని తక్షణం

ఫ్రీజ్ చేసిన సైబర్‌క్రైమ్ పోలీసులు

సిటీబ్యూరో, డిసెంబరు 18 (నమస్తే తెలంగాణ): అధిక లాభాల పేరుతో పీఎంఎల్ ప్రో యాప్ ద్వారాలో వ్యక్తిని సైబర్ నేరగాళ్లు మోసగించిన ఘటనలో సైబర్‌క్రైమ్ పోలీసులు తక్షణం స్పందించి 50 లక్షల రూపాయలను ఫ్రీజ్ చేరసి రికవరీ చేయగలిగారు. నగరానికి చెందిన 53 ఏళ్ల వ్యక్తికి ఇటీవల పీఎంఎల్ ప్రో యాప్ పేరుతో ఒక వాట్సాప్ మెసేజ్ వచ్చింది. తక్కువ పెట్టుబడికే పెద్ద ఎత్తున లాభాలు ఉంటాయనే యాప్‌లో వివరాలు ఉండడంతో అది నిజమని నమ్మిన బాధితుడు యాప్ నిర్వాహకులు సూచించినట్టుగా 1.31 కోట్లు బదిలీ చేశాడు. ఆ తర్వాత యాప్ పనిచేయకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి సైబర్‌నేరగాళ్ల బ్యాంక్ ఖాతాలను గుర్తించారు. వాటిలో ఉన్న రూ.50.87లక్షలను ఫ్రీజ్ చేశారు. ఈ డబ్బును న్యాయస్థానం ద్వారా బాధితుడికి అందచేయనున్నారు.

న్యూఇయర్ వేడుకలపై నిఘా పెట్టండి

మత్తు పదార్థాలు, నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం సరఫరా జరగకుండా చర్యలు తీసుకోవాలి

సమీక్షా సమావేశంలో ఆబ్కారీ ఈడీ వి.బి.కమలాసన్‌రెడ్డి

సిటీబ్యూరో, డిసెంబరు 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్, రంగారెడ్డి పరిధిలో జరిగే నూతన సంవత్సర వేడుకలపై పటిష్టమైన నిఘా పెట్టాలని, ముఖ్యంగా డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు, ఇతర ప్రాంతాలకు చెందిన నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సరఫరా, వినియోగం జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో నూతన సంవత్సర వేడుకలపై హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ఎస్‌టిఎఫ్, ఎక్సైజ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సర వేడుకల్లో ఆబ్కారీ నేరాల నియంత్రణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. ఈనెల 20నుంచి జనవరి మొదటి వారం వరకు ఎవ్వరూ సెలవులు పెట్టవద్దని ఆదేశించారు. నగరంలో డ్రగ్స్, నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సరఫరా జరగకుండా గట్టి నిఘా పెట్టాలని సూచించారు. రైళ్లు, ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను దిగుమతి చేసే ముఠాలపై నిఘా పెట్టి ఎన్‌డీపీఎల్ మద్యాన్ని నిలువరించాలని సూచించారు. పది నుంచి 15రోజుల పాటు ఎస్‌టిఎఫ్, డిటిఎఫ్, ఇతర ఆబ్కారీ బృందాలతో ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడైనా కొత్త సంవత్సర వేడుకల్లో నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నూతన సంవత్సర వేడుకలను నిర్వహించే ఈవెంట్ మేనేజర్ల కదలికలపై నిఘా పెట్టాలని, కమర్షియల్ ఫంక్షన్‌హాల్స్, కన్వెన్షన్స్ హాళ్ళలో నిర్వహించే వేడుకలపై డేగ కన్ను పెట్టాలన్నారు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని నానక్‌రామ్‌గూడ, సింగరేణి కాలనీ, ఎల్బీనగర్, కర్మాన్‌ఘాట్, గోల్కొండ, పుప్పాలగూడ, మణికొండ, రామకృష్ణకాలనీ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్లు ఖురేషీ, కేఏబి శాస్త్రీ, డిప్యూటి కమిషనర్ పి.దశరథ్, అదనపు ఎస్పి భాస్కర్, ఏసీలు ఆర్.కిషన్, అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రణవీ, డిఎస్‌పిలు తుల శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్, శంషాబాద్, మల్కాజిగిరి, మేడ్చల్ సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కృష్ణ ప్రియ, కె.నవీన్, ఫయాజుద్దీన్, ఉజ్వల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాపులర్ అవబోయి.. కటకటాల పాలయ్యాడు

మనీ హాంటింగ్ ఛాలెంజ్ రీల్స్ చేసి కటకటాల పాలైన యూట్యూబర్ భానుచందర్.

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 18: సోషల్ మీడియాలో అర్జంటుగా పాపులర్ అయి పోవాలని రీల్స్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసిన ఓ యూట్యూబర్ ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్‌లో మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని బాలానగర్‌కు చెందిన రాయలపురం భానుచందర్(29) యూట్యూబర్. ఈ నెల 12న ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధి అవుటర్ రింగ్ రోడ్డుపై ఎగ్జిట్ నెంబర్ 9 వద్ద మనీ హాంటింగ్ ఛాలెంజ్ పేరుతో రీల్స్ చేశాడు. అక్కడ 20 వేల రూపాయల విలువైన నోట్లను చెట్ల పొదలలో వేస్తున్నానని, వాటిని ఎవరైనా తీసుకోవచ్చని గుడ్ లక్ చెప్పి రీల్స్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. పోస్టు చేసిన రీల్స్‌ను చూసినవాళ్లు ఆ వీడియోను తమ తమ మిత్రులకు షేర్ చేయాలని కోరాడు. నోట్లను అక్కడి పొదల్లో దాచిన దృశ్యం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పోస్టు చేసిన వీడియో వైరల్ కావటంతో అవుటర్ రింగ్ రోడ్డుపై హైవే పెట్రోలింగ్ వాహనం ఇంచార్జి బండారు శ్రీరాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు భానుచందర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ చక్రపాణి తెలిపారు.

పోలీసు సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు, పోలీసు సిబ్బందికి సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి బుధవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులు ప్రధానం చేశారు. ఈ పోటీల్లో ముగ్గురు ఎస్ఐ స్థాయి అధికారులు, 9మంది ఇంటర్ విద్యార్థులు, 6మంది డిగ్రీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ(ట్రాఫిక్) జోయల్, ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్నం తదితరులు పాల్గొన్నారు.

శ్రీ తేజను పరామర్శించిన అల్లు అరవింద్

బేగంపేట, డిసెంబరు 18 (నమస్తే తెలంగాణ): సంధ్య థియేటర్ బాధితుడైన చిన్నారి శ్రీతేజను సినీ నిర్మాత అల్లు అరవింద్ బుధవారం పరామర్శించారు. బాధితుడిని పరామర్శించి అతడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రోగి ఆరోగ్యపరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

వెబ్‌సిరీస్ నటుడు బెహరా ప్రసాద్ రిమాండ్

యువతి పట్ల అసభ్యప్రవర్తన

బంజారాహిల్స్, డిసెంబర్ 18: ఫిల్మ్ షూటింగ్‌లో ఓ అమ్మాయి పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు వెబ్‌సిరీస్ నటుడు బెహరా ప్రసాద్‌కు నాంపల్లి కోర్టు రిమాండ్ విధించింది. మణికొండలో నివాసం ఉంటున్న ఓ వర్ధమాన నటి(31) వివిధ వెబ్ సీరిస్‌లతో పాటు టీవీ సీరియళ్లలో హీరోయిన్‌గా నటిస్తున్నది. ఏడాదిన్నర క్రితం.. 'పెళ్లివారమండి' వెబ్‌సీరిస్‌లో హీరోగా నటించిన ప్రసాద్ బెహ్రాతో ఆమెకు పరిచయం ఏర్పడింది. అప్పట్లో షూటింగ్ సందర్భంగా బెహరా ప్రసాద్ పలుమార్లు నటితో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె అర్ధాంతరంగా షూటింగ్ నిలిపివేసింది. తదనంతరంత ఇద్దరి మధ్య రాజీ కుదరడంతో తిరిగి ఆమె 'మెకానిక్' వెబ్‌సిరీస్‌లో ఆయనతో కలిసి నటించేందుకు ఒప్పుకున్నది. గత కొన్ని రోజులుగా జూబ్లీహిల్స్‌లోని సైలెంట్ వ్యాలీలోని ఓ ఇంట్లో 'మెకానిక్' షూటింగ్ జరుగుతున్నది. షూటింగ్ విరామ సమయాల్లో..తిరిగి అసభ్యకరంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. బెహరా ప్రసాద్ చేష్టలు శృతిమించడంతో ఆయన ఆగడాలు తట్టుకోలేక బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా నాంపల్లి కోర్టు రిమాండ్ విధించింది.

అధిక వడ్డీలు ఇప్పిస్తామంటూ... ఆశచూపి

బంజారాహిల్స్,డిసెంబర్ 18: వ్యాపారంలో లాభాలు, అధిక వడ్డీలు ఆశచూపి కోట్లాది రూపాయలు వసూలు చేసి ముఖం చాటేసిన భార్యాభర్తలతో పాటు ఆమెకు సహకరించిన మరికొందరిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం 14లోని నందినగర్ గ్రౌండ్స్‌కు సమీపంలోని వెంకటేశ్వరనగర్‌లో నివాసం ఉంటున్న కొడాలి శ్రీలక్ష్మి అనే మహిళ, తన భర్త సత్యప్రసాద్‌తో కలిసి అధిక వడ్డీలు ఇప్పిస్తానంటూ, వ్యాపారంలో పెట్టుబడులు అంటూ స్థానికులను నమ్మించింది. వివిధ కారణాలు చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి 10 లక్షలదాకా ఒకరికి తెలియకుండా మరొకరి నుంచి డబ్బులు వసూలు చేసి కొడాలి శ్రీలక్ష్మి, ఆమె భర్త సత్యప్రసాద్ ఇటీవల ఇంటికి తాళం వేసి ఉడాయించారు. పూచీకత్తు కోసం ఆమె ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయి. ఈ వ్యవహారంలో తమను నిండాముంచిన కొడాలి శ్రీలక్ష్మి, ఆమె భర్త సత్యప్రసాద్‌తో పాటు ఆమెకు సహకరించిన తన్నీరు పద్మ, తన్నీరు రామకృష్ణ, నిహారిక, దొడ్డపనేని శైలజ తదితరులపై చర్యలు తీసుకోవాలని 20మంది బాధితులు ఫిర్యాదులో కోరారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బాధితుల సంఖ్య భారీగా ఉండే అవకాశం ఉండడంతో కేసును సీసీఎస్‌కు బదిలీ చేసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

పక్కింట్లోని బాత్‌రూంలో వీడియోలు తీస్తూ..

బంజారాహిల్స్,డిసెంబర్ 18: పక్కింట్లోని బాత్‌రూమ్‌లో వీడియోలు తీస్తున్న వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. వివరాల్లోకి వెళ్తే.. యూసుఫ్‌గూడ ఎల్ఎన్‌నగర్‌లో నివాసం ఉంటున్న వ్యాపారి(34) మధ్యాహ్నం తన ఇంట్లో ఆవరణలోని బాత్‌రూమ్‌లో స్నానం చేస్తున్నాడు. అదే సమయంలో పక్కింట్లో నివాసం ఉంటున్న అఫ్సర్ అనే వ్యక్తి పైనుంచి సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తూ కనిపించాడు. దీంతో బయటకువచ్చి అతడిని పట్టుకునేందుకు యత్నించగా పారిపోయాడు. తాను స్నానం చేసేందుకు ముందే తన భార్య స్నానం చేసి రావడంతో ఆమె వీడియోను కూడా తీసినట్లు గుర్తించిన బాధితుడు అఫ్సర్‌ను పట్టుకునేందుకు యత్నించినా ప్రయోజనం లేకపోవడంతో బుధవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఐపీఎస్ అధికారి డ్రైవర్‌పై దాడి

హెడ్ కానిస్టేబుల్ అరెస్ట్

బంజారాహిల్స్,డిసెంబర్ 18: హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా డ్రైవర్‌పై అకారణంగా దాడికి పాల్పడిన హెడ్‌కానిస్టేబుల్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. అంబర్‌పేటలో నివాసం ఉంటున్న మహ్మద్ అక్రమ్ అనే కానిస్టేబుల్ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐపీఎస్ అధికారి రవిగుప్తా వద్ద డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈనెల 14న ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో నివాసం ఉంటున్న రవిగుప్తా ఇంటివద్దకు పనిమీద వెళ్లి బొలేరో వాహనం మీద తిరిగి వెళ్తున్నాడు. యూసుఫ్‌గూడ చెక్ పోస్ట్ వద్ద బెటాలియన్ గేట్‌వద్దకు రాగానే యాక్టివా బైక్ నడిపిస్తున్న 3వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మంతో గొడవ జరిగింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనయిన బ్రహ్మం తన యాక్టివా బైక్‌ను అడ్డుగా పెట్టి డోర్‌వద్దకు వచ్చాడు. డోర్ అద్దాలు దించగానే ముఖంపై రాయితో దాడి చేసి అక్కడినుంచి పారిపోయాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో నిందితుడి మీద కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అగ్ని ప్రమాదంలో మహిళ మృత్యువాత

శామీర్‌పేట, డిసెంబర్ 18 : అగ్ని ప్రమాదంలో మహిళ మృత్యువాత పడిన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు... శామీర్‌పేట మండలం పొన్నాల్ గ్రామంలో నివాసం ఉంటున్న ఊదరి యాదగిరి రోజువారి కూలి పని చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. భార ఊదరి భాగ్య(40) ఉంది. కూలి పని కోసం భర్త కరీంనగర్‌కు వెళ్ళాడు. కాగా గత కొంతకాలంగా మద్యానికి బానిసైన భాగ్య మంగళవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చింది. ఇంట్లో కొవ్వతి వెలిగించి నిద్రలోకి జారుకుంది. కొవ్వత్తి క్రింద పడి బెడ్‌షీట్, చీరకు నిప్పుటుకుందో ఏమోగాని మద్యం మత్తులు ఉన్న భాగ్యకు ఏమి తెలియలేదు. ఈ అగ్ని ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందింది. ఇంట్లో నుంచి పొగలు వస్తుండడం గమనించిన స్థానికులు ఇంటి తలుపు విరగొట్టారు. అప్పటికే మృతి చెందడంతో విషయాన్ని పోలీసులకు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు

సూపర్‌ఫాస్ట్ రైల్లో దొంగతనం..

కాచిగూడ,డిసెంబర్ 18: మహబూబ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ రైల్లో ఓ ప్రయాణికుని బంగారు అభరణాలు, నగదును దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం నాచారం ప్రాంతానికి చెందిన శివాజిపటేల్(66) అహ్మదాబాద్-కాచిగూడ -మహబూబ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ రైల్లో ఏ-1 కోచ్‌లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్యంలోని జల్గాన్ రైల్వేస్టేషన్ జంక్షన్ సమీపంలో బ్యాగు చూసుకునేసరికి అందులో ఉన్న 35 గ్రాముల బంగారు అభరణాలు, రూ.30వేలు, ఖరీదైన 2 సెల్‌ఫోన్‌లు కనిపించలేదు. దీంతో బుధవారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం బుస్వాల్ రైల్వేస్టేషన్‌కు బదిలీ చేసినట్లు కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపారు.

మరో సంఘటనలో....

మూసాపేట ప్రాంతానికి చెందిన జైన్ దివేక్‌కుమార్(40)వృత్తిరీత్యా ప్రైవేటు ఉద్యోగి. అహ్మదాబాద్-కాచిగూడ మహబూబ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ రైల్లో కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వస్తుండగా మార్గమధ్యలో ఉన్న జల్గాన్ రైల్వేస్టేషన్ జంక్షన్ సమీపంలో బ్యాగు చూసుకునేసరికి అందులో ఉన్న 11 గ్రాముల బంగారు అభరణాలు, రూ.8 వేల రూపాయలు, సెల్‌ఫోన్ కన్పించలేదు. దీంతో ఆయన బుధవారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం బుస్వాల్ రైల్వేస్టేషన్‌కు బదిలీ చేసినట్లు కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపారు.

టీస్టాల్‌లో గంజాయి చాక్లెట్లు

ఘట్‌కేసర్,డిసెంబర్18: పోచారం పోలీస్టేషన్ పరిధిలోని అన్నోజిగూడలో గంజాయి చాక్లెట్లను పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. ఇక్కడి ఫ్లైఓవర్ వద్ద గల టీస్టాల్ నిర్వహిస్తున్న ఇద్దరి వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు వివరాల ప్రకారం రాంనారాయణ షా, కిశోర్ కుమార్ ఇద్దరు అన్నోజిగూడ వద్ద టీస్టాల్ నిర్వహిస్తూ.. అక్కడే గంజాయి చాక్లెట్లను అమ్ముతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోచారం పోలీసులు దాడిచేసి పట్టుకొని విచారించారు. తామే గంజాయి చాక్లెట్లను తీసుకొచ్చి విక్రయిస్తున్నామని ఒప్పుకున్నారు.దీంతో అరెస్టు చేసి వారి వద్దనున్న1190 గ్రాముల 230 చాక్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కిరాణాషాపులో కూడా... గంజాయి చాక్లెట్లు

జగద్గిరిగుట్ట,డిసెంబర్18: కిరాణా షాపులో గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న నిందితుడిని బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్న సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రింగ్‌బస్తీ కిరాణాషాపులో 13 కేజీల గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న సునీల్‌కుమార్ జాను ఎస్ ఓటీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

చలి @14.7డిగ్రీలు

సిటీబ్యూరో, డిసెంబరు 18 (నమస్తే తెలంగాణ): కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోతుండడంతో నగరంలో బుధవారం రాత్రి వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు 30.6డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 14.7డిగ్రీలు, గాలిలో తేమ 36శాతంగా నమోదయ్యాయి.

సట్టా బెట్టింగ్ గుట్టు రట్టు

సిటీబ్యూరో, డిసెంబరు 18 (నమస్తే తెలంగాణ): సట్టా బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురు నిర్వాహకులతో పాటు 20మంది పంటర్లను దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.30,376 నగదు, లాటరీ చార్ట్, 15 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం...జుమ్మెరాత్‌బజార్ ప్రాంతానికి చెందిన విశాల్‌సింగ్(26), బహదూర్‌పురాకు చెందిన నరేశ్ కుమార్(24), ధూల్‌పేట్ ప్రాంతానికి చెందిన అనికేత్ సింగ్(22), అక్షయ్‌సింగ్(26) షాహినాయత్ గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో గత కొంత కాలంగా యధేచ్ఛగా సట్టా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు సట్టా నిర్వహిస్తున్న నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు 20మంది పంటర్లు, సబ్ ఆర్గనైజర్లను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.30,376నగదు, 15సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును షాహినాయత్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. దాడులు జరిపిన వారిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, ఎస్ఐ ఎన్.నవీన్, కె.నర్సింహులు, జి.ఆంజనేయులు పాల్గొన్నారు.

సింథటిక్ కలర్స్‌తో ఆహారం..

సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : బల్దియా ఫుడ్ సేఫ్టీ అధికారులు కాచిగూడలోని ముబారక్ మండి హౌస్‌లో తనిఖీలు చేపట్టారు. సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వంటగది అపరిశుభ్రంగా ఉండటం, లైట్లు సరిగా లేకపోవడం, రిఫ్రిజిరేటర్ల లోని ఆహార వస్తువులను లేబుల్ సరిగా లేవని తేల్చారు. అలాగే నారాయణగూడ మైఫిల్ బిర్యానీ దర్బార్‌లో కిచెన్ అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. వంటగదిలో నీరు నిలిచిపోవడం, పేరుకుపోయిన ఆహార వ్యర్థాలు, రిఫ్రిజిరేటర్లు అపరిశుభ్రంగా ఉందని తేల్చారు. సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

డాక్టర్‌నే బోల్తా కొట్టించిన నిత్య పెళ్లి కొడుకు

- విగ్గులు పెట్టుకొని వేషం మారుస్తూ ఆస్తిమంతుడినని నమ్మబలికి 21 లక్షలు తీసుకొని పరార్
- గతంలో ఎస్ఆర్ నగర్‌లో ఇదే తరహా మోసం
- రాయదుర్గంలో నమోదైన కేసు

శేరిలింగంపల్లి, డిసెంబర్ 18 : పెళ్ళి చేసుకుంటానని నమ్మించి యువతుల కుటుంబ సభ్యుల వద్ద అందిన కాడికి దోచుకుని కనిపించకుండా తిరుగుతున్న నిత్య పెళ్ళి కొడుకు మీద రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. విగ్గులు పెట్టుకుని, వేషాలు మారుస్తూ పెళ్ళి పేరుతో గతంలో పదుల సంఖ్యలో మోసాలకు పాల్పడినట్లు తెలుస్తున్నది. ఓ యువతి కుటుంబ సభ్యులను సైతం పెళ్ళి పేరుతో మోసం చేసి వారి నుంచి రూ. 21లక్షలు వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్న నిత్య పెళ్ళి కొడుకు మీద రాయదర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో ఎస్ఆర్ నగర్ పోలీసుస్టేషన్‌లో సైతం ఇదే తరహాలో మోసానికి పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు నిత్య పెళ్ళి కొడుకు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఖాజాగూడలో నివాసం ఉంటూ డాక్టర్‌గా పనిచేస్తున్న ఓ యువతి పెళ్లి సంబంధాల కోసం తన ప్రొఫైల్‌ను మ్యాట్రిమొనీ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఆమె ప్రొఫైల్‌ను చూసిన రాయపాటి క్రిష్ణచౌదరి అనే వ్యక్తి వీరిని సంప్రదించాడు. తనకు ఆ యువతి ప్రొఫైల్ నచ్చిందని, పెళ్ళి చేసుకుంటానని చెప్పాడు. తన తల్లిదండ్రులు రంగప్రసాద్ రావు, రాణిదేవిలతో పాటు తన సోదరి మాధురిలు ఆస్ట్రేలియాలో ఉంటున్నారని, తానొక్కడినే నగరంలో ఉంటూ ఉద్యోగం చేస్తున్నానని యువతిని, యువతి కుటుంబాన్ని నమ్మించాడు. తల్లిదండ్రులంటూ ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడించి..తమకు ఎటువంటి కట్న కానుకలు అవసరం లేదని నమ్మించి నిశ్చితార్థం చేసుకుందామని నిర్ణయించుకున్నారు. యువతి కుటుంబం కూడా పెళ్లికి అంగీకరించింది. ఈ క్రమంలో వేర్వేరు వంకలతో సెప్టెంబర్ 28,29,31వ తేదీన యువతి ఇంటికి వచ్చిన క్రిష్ణచౌదరి కొన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, నిశ్చితార్థం షాపింగ్ కోసం డబ్బులు సర్దుబాటు చేస్తే ఆస్ట్రేలియా నుంచి తన తల్లిదండ్రులు వచ్చిన తర్వాత తిరిగి ఇస్తానని చెప్పాడు. అతని మాటలు నమ్మిన యువతి తండ్రి పలు దఫాలుగా రూ.19 లక్షల నగదు ఇవ్వడంతో పాటు 2.20 లక్షలకు ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేశాడు. డబ్బు తీసుక